నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, సోమవారం 16 జూన్ 2025 | MEDAK

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు భరోసా

న్యాల్‌కల్ మండలం చాల్కి చౌరస్తాలో పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

- జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, జూన్ 15: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు సీఎం సహాయ నిధి ఎంతో భరోసా నిస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. ఆదివారం జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రంజోల్‌కు చెందిన చంద్రకళకు రూ. 52,500, నాగమ్మకు రూ.24 వేలు, డేవిడ్ రాజ్‌కు రూ. 23వేలు, దత్తగిరి కాలనీకి చెందిన పర్వీన్‌కు రూ.60 వేలు, రమాకాంత్‌కు రూ.54వేలు, బాగారెడ్డిపల్లికి చెందిన మొగులయ్యకు రూ.15వేలు, చిన్న హైదరాబాద్‌కు చెందిన శ్యామ్‌సుందర్‌కు రూ.60 వేల చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అనంతరం మొగుడంపల్లి మండలంలోని సత్వార్‌కు చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు మాణిక్‌రెడ్డిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. న్యాల్‌కల్ మండలంలోని చాల్కి చౌరస్తాలో కొత్తగా ఏర్పాటు చేసిన డ్యాన్ని ఫిల్లింగ్ స్టేషన్(పెట్రోల్ బంక్)ను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, ఆయా మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, రవీందర్, వెంకటేశం, పార్టీ నాయకులు నామరవికిరణ్, నర్సింహారెడ్డి, స్వప్నభాస్కర్, మోహన్‌రెడ్డి, సత్యం ముదిరాజ్, యాకూబ్, చిన్నారెడ్డి, అమిథ్‌రాజ్, సయీద్, విజయ్‌రాథోడ్, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రన్న, సుధాకర్‌రెడ్డి, ఉమేశ్ పాటిల్ పాల్గొన్నారు.

ఉత్తమ డాక్టర్‌కు హరీశ్‌రావు అభినందనలు

డాక్టర్ అరవింద్

సిద్దిపేట, జూన్ 15: సిద్దిపేటకు చెందిన తెలంగాణ సూపర్ స్పెషాలిటీ డెంటల్ దవాఖాన వైద్యుడు అరవింద్‌ను సుమన్ టీవీ అవార్డు వరించింది. దశాబ్ద కాలంగా సిద్దిపేట ప్రాంతంలో వైద్యుడిగా సేవలు అందిస్తూనే.. సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న డాక్టర్ అరవింద్‌ను ఉత్తమ వైద్యుడిగా సుమన్ టీవీ ఎంపిక చేసింది. ఆదివారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. సిద్దిపేట నుంచి సుమన్ టీవీ అవార్డు అందుకోవడం అభినందనీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆయన్ను ప్రశంసించారు. ఈ అవార్డు స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ మాజీ సర్పంచ్


అంకం దశరథను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలిపిచెడ్, జూన్ 15: రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ పాలనపై విసుగు చెంది ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో రాందాస్‌గూడకు చెందిన కాంగ్రెస్ మాజీ సర్పంచ్ దశరథ్, లచ్చయ్య, బీజేపీ నాయకుడు వెంకటేశ్వర రావు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్ రెడ్డి, లక్ష్మణ్, మాజీ సర్పంచ్ యాదగిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆహ్వానించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డంప్‌యార్డు ఏర్పాటును విరమించుకోవాలి

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, జూన్ 15: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగరలో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డు వద్దని రైతు జేఏసీ నాయకులు చేపడుతున్న నిరాహార దీక్ష కొనసాగుతున్నది. రిలే నిరాహార దీక్ష ఆదివారానికి 131వ రోజుకు చేరుకుంది. దీక్షలో రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇన్ని రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి డంపింగ్ యార్డు ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

సైబర్ క్రైమ్ రీఫండ్‌లో సంగారెడ్డికి 5 స్థానం

- ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడి

సంగారెడ్డి, జూన్ 15: జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా సైబర్ క్రైమ్ రీఫండ్‌లో సంగారెడ్డి జిల్లాకు ఐదోస్థానం వచ్చిందని, మెగా లోక్ అదాలత్‌లో 4287 కేసులు రాజీతో పరిష్కరించుకున్నారని ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన రూ.1.43 కోట్లను బాధితులకు ఈనెల 14న జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో అందజేసినట్లు తెలిపారు. లోక్ ఆదాలత్‌లో 4287 కేసులను రాజీ చేసుకోవడానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ప్రజలు ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేసి లేదా, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో లాగిన్ అయి దరఖాస్తు చేయాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసిన అధికారులు డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, డీ4సీ ఇన్‌స్పెక్టర్ రవి, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎస్ఐ సత్యనారాయణ, అధికారులు, కోర్ట్ డ్యూటీ, సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నల్లవాగు ప్రాజెక్టు అలుగు ఆప్రాన్ ధ్వంసం

నల్లవాగు ప్రాజెక్టు అలుగు వద్ద ధ్వంసమైన దిగువ భాగం ఆప్రాన్

సిర్గాపూర్, జూన్ 15: సంగారెడ్డి జిల్లాలోని మధ్యతరహా ప్రాజెకు నల్లవాగు అలుగు వద్ద దిగువ భాగమైన ఆప్రాన్ ధ్వంసమైంది. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టు ఆధునీకరణకు రూ. 24కోట్లు మంజూరు చేసింది. రెండేండ్ల క్రితం ఆధునీకరణ పనుల్లో భాగంగా అలుగు వద్ద అభివృద్ధి పనులు చేపట్టారు. భారీ వర్షాలకు ప్రాజెక్టు నిండి అలుగు ద్వారా దిగువకు వరద జలాలు పొంగిపొర్లడంతో, వరద ఉధృతికి అలుగు సగం భాగం వరకు దిగువ ప్రదేశమంతా (ఆప్రాన్) దెబ్బతిన్నది. ఈ ఏడాది కూడా అలుగు పొర్లి ప్రవహిస్తే వరద ఉధృతికి అలుగు దిగవ ప్రాంతమంతా కోతకు గురై పెద్ద గుంతలు ఏర్పడే అవకాశం ఉందని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి అలుగు ఆప్రాన్‌కు సీసీ మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై డీఈఈ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా, ప్రాజెక్టు ఆధునీకరణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

పుల్కల్ మండలం బస్వాపూర్ వద్ద జరుగుతున్న సింగూరు కాల్వల లైనింగ్ పనులు

పోస్టింగ్ వద్దేవద్దు!

ఇరిగేషన్ శాఖలో సీఈ, ఎస్ఈ పోస్టులు ఖాళీ

- సంగారెడ్డి జిల్లాకు వచ్చేందుకు అధికారుల నిరాసక్తత
- ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టేందుకు విముఖత
- మంత్రులు హామీ ఇచ్చినా నో చెబుతున్న అధికారులు
- అధికారులపై రాజకీయ ఒత్తిళ్లే కారణమా..?
- ఇమడ లేకపోతున్న నిజాయితీ, నిక్కచ్చి గల అధికారులు
- జిల్లాలో నత్తనడకన సాగుతున్న సింగూరు ఆధునీకరణ పనులు
- ఇప్పటికే రెండు పంటలు కోల్పోయిన ఆయకట్టు రైతులు

సంగారెడ్డి, జూన్ 15(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలోని నీటిపారుదల శాఖలో కీలకమైన చీఫ్ ఇంజినీర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు పోస్టుల్లో ఖాళీలు ఏర్పడి పక్షం రోజులు అయ్యాయి. కీలకమైన రెండు పోస్టుల్లో చేరేందుకు ఆ శాఖలోని అధికారులు ఎవరూ ముందుకు రావడం లేదు. కనీసం ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకునేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. మంత్రులు సూచించినా చీఫ్ ఇంజినీర్, ఎస్ఈ పోస్టుల్లో చేరేందుకు అధికారులు ససేమిరా అంటున్నట్లు తెలిసింది. ఒకప్పుడు సంగారెడ్డి జిల్లాలో నీటిపారుదలశాఖలో పనిచేసేందుకు అధికారులు పోటీ పడేవారు. హైదరాబాద్‌కు సంగారెడ్డి జిల్లా సమీపంగా ఉండడం, నీటిపారుదల శాఖలో ఎలాంటి ఒత్తిళ్లు లేకపోవటంతో ఇక్కడ పనిచేసేందుకు ఇరిగేషన్ అధికారులు ఆసక్తి చూపేవారు. జిల్లాలో పోస్టు దక్కించుకునేందుకు సర్వశక్తులు ఒడ్డేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. నీటిపారుదల శాఖలో పనిచేసేందుకు అధికారులు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఇందుకు సంగారెడ్డి జిల్లాలో చీఫ్ ఇంజినీర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ పోస్టులు ఖాళీగా ఉండటాన్ని ఉదాహరిస్తున్నారు. రాష్ట్ర స్థాయితో పాటు జిల్లాలోని అధికారులు ఎవరూ ఆ పోస్టుల్లో చేరేందుకు ఆసక్తి కనబర్చడం లేదు. ఇతర జిల్లాలకు చెందిన అధికారులు సీఈ, ఎస్ఈ పోస్టుల్లో చేరేందుకు ఆసక్తి చూపినప్పటికీ, జిల్లాలోని పరిస్థితులను చూసి వెనక్కు తగ్గుతున్నట్లు సమాచారం. నీటిపారుదల శాఖ అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది.

పక్షం రోజులుగా సీఈ, ఎస్ఈ పోస్టులు ఖాళీ

సంగారెడ్డి జిల్లాలో నీటిపారుదల శాఖలో సీఈ, ఎస్ఈ పోస్టులు భర్తీ కాకుండా పక్షం రోజులు అవుతున్నది. చీఫ్ ఇంజినీర్‌గా పనిచేసిన ధర్మను ప్రభుత్వం ఈఎన్‌సీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఈనెల 1న ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మపై అవినీతి ఆరోపణలు వచ్చిన కారణంగానే ఆయన్ను సీఈ పోస్టు నుంచి తప్పించినట్లు తెలుస్తున్నది. ఎన్‌వోసీ జారీ విషయంలో భారీ ఎత్తున డబ్బులు డిమాండ్ చేయడంతో సీఈ ధర్మపై ప్రభుత్వం బదిలీ వేటు వేసినట్లు సమాచారం. ధర్మ స్థానంలో ప్రభుత్వం కొత్త సీఈని ఇంత వరకు నియమించలేదు. సంగారెడ్డి సీఈగా పనిచేసేందుకు ఇరిగేషన్ శాఖలోని అధికారులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తుంది. మొదట ఖమ్మం, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు అధికారులు సంగారెడ్డి సీఈ పోస్టుపై ఆసక్తి కనబర్చారు. తీరా జిల్లాలోని పరిస్థితులను తెలుసుకున్న తర్వాత సీఈ పోస్టులో చేరే ప్రయత్నాలను ఇద్దరు అధికారులు విరమించుకున్నట్లు సమాచారం. సీఈ పోస్టులో చేరేందుకు అర్హత ఉన్న అధికారులు ఎవరూ సంగారెడ్డి జిల్లాకు వచ్చేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తున్నది. సంగారెడ్డి జిల్లాకు వెళ్లాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నా, ఆ జిల్లాకు వెళ్లమని అధికారులు సున్నితంగా తిరస్కరిస్తున్నట్లు సమాచారం. ఇన్‌చార్జి సీఈగా సైతం బాధ్యతలు చేపట్టేందుకు సైతం అధికారులు ఆసక్తి చూపడం లేదు. సంగారెడ్డి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పోస్టు సైతం పక్షం రోజులుగా ఖాళీగా ఉంది. ఎస్ఈగా పనిచేసిన యేసయ్య గతనెల 31న ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఎస్ఈ పోస్టులో చేరేందుకు అధికారులు ఎవరూ ముందుకు రావడం లేదని లేదని తెలిసింది. ఇన్‌చార్జి ఎస్ఈగా సైతం బాధ్యతలు తీసుకునేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదు. సంగారెడ్డి సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఈఈలు ఇన్‌చార్జి ఎస్ఈగా బాధ్యతలు చేపట్టాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించినా అధికారులు సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. జిల్లాలో 4 డీఈ పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఇందులో జహీరాబాద్ డివిజన్‌లో 2, నారాయణఖేడ్ డివిజన్‌లో 2 ఖాళీ ఉన్నాయి. ఏఈ పోస్టులు సంగారెడ్డి డివిజన్‌లో 1, దౌల్తాబాద్ డివిజన్‌లో 3 ఖాళీ ఉన్నాయి.

అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పెరగడమే కారణమా?

నీటిపారుదల శాఖలోని అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతుండడంతోనే సంగారెడ్డి జిల్లాలో సీఈ, ఎస్ఈగా పనిచేసేందుకు అధికారులు విముఖత చూపుతున్నట్లు తెలిసింది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు తాము చెప్పిన పనులు చేయాలని ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి చేయడంతో పాటు నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న పనులు సైతం పూర్తి చేయాలని అధికారులను దబాయిస్తున్నట్లు తెలిసింది. తాము సూచించిన వ్యక్తులకు ఇరిగేషన్ కాంట్రాక్టులు ఇవ్వాలని, తాము చెబితేనే బిల్లులు చెల్లించాలని ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఎన్ఓసీ జారీ విషయంలో ప్రజాప్రతినిధులు ఇరిగేషన్ అధికారులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. తాము సూచించిన వ్యక్తులకు ఎన్‌వోసీలు ఇవ్వాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ ఎన్‌వోసీలు ఇవ్వాలని అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో ఎన్‌వోసీల జారీ విషయంలో ప్రజాప్రతినిధుల ప్రమేయం అధికంగా ఉన్నట్లు తెలుస్తుంది. తాను సూచించిన వ్యక్తులకు ఎన్‌వోసీ జారీచేయకపోవటంతో ఆగ్రహించిన ఓ ఎమ్మెల్యే నీటిపారుదల శాఖ అధికారిని బూతులు తిట్టడంతో పాటు సస్పెండ్ చేయిస్తానని బెదిరించినట్లు సమాచారం. ఎన్‌వోసీల విషయమై రాజకీయ ఒత్తిళ్లు విపరీతంగా పెరుగుండటంతో ఇరిగేషన్ అధికారులు మనోవేదనకు గురవుతున్నారు. రాజకీయనాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి పనిచేయలేక కొంతమంది అధికారులు ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇరిగేషన్ శాఖలో రాజకీయ పెత్తనం పెరగడంతోనే సంగారెడ్డి జిల్లాలో ఖాళీగా ఉన్న సీఈ, ఎస్ఈ పోస్టుల్లో చేరేందుకు అధికారులు విముఖత చూపుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే జిల్లాలో సింగూరు కాల్వల ఆధునికీరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. పనులు పూర్తికాక ఇప్పటికే ఆయకట్టు రైతులు రెండు పంటలు కోల్పోయాయి. జిల్లా సాగునీటి రంగంపై పర్యవేక్షణ లేక, పనులు వేగంగా పూర్తికాక ఆయకట్టు రైతులకు నీళ్లందక పంటలు పండక నష్టపోతున్నారు. నిజాయితీ, నిక్కచ్చి గల అధికారులతో సీఈ,ఎస్ఈ పోస్టులు భర్తీ చేసి జిల్లాలో సాగునీటి రంగాల్లో బలోపేతం చేయాలని రైతులు కోరుతున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటాలి

- తైక్వాండో జిల్లా గౌరవ అధ్యక్షుడు వేలేటి రాధాకృష్ణ శర్మ

తైక్వాండోలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులతో తైక్వాండో అసోసియేషన్ సభ్యులు

సిద్దిపేట టౌన్, జూన్ 15: తైక్వాండోలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని తైక్వాండో అసోసియేషన్ సిద్దిపేట జిల్లా గౌరవ అధ్యక్షుడు వేలేటి రాధాకృష్ణ శర్మ పిలుపునిచ్చారు. తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలోని ఐఎంఏ హాల్‌లో తైక్వాండో బెల్ట్‌ల ప్రమోషన్ టెస్ట్ నిర్వహించారు. 60 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమానికి రాధాకృష్ణ శర్మ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు కలర్ బెల్టులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆత్మ రక్షణకు విద్యార్థులు తైక్వాండో నేర్చుకోవాలని సూచించారు. డీఎస్‌వో వెంకట నరసయ్య, రూరల్ సీఐ శ్రీనివాస్, వైద్యురాలు ప్రణీత, తైక్వాండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్య, ఉద్యోగాల్లో 2శాతం స్పోర్ట్స్ కోటా లభిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడలు ఆడేలా తల్లిదండ్రులు, గురువులు ప్రోత్సహించాలని సూచించారు.

నిరుపయోగంగా పల్లె ప్రగతి ట్రాక్టర్

సిర్గాపూర్ మండలం పెద్ద ముబారక్‌పూర్‌లో మూలన చేరిన ట్రాక్టర్ ఇంజిన్, ట్రాలీ

- నిధులు లేక చేతులెత్తేసిన పంచాయతీ కార్యదర్శి
- గ్రామంలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం

సిర్గాపూర్, జూన్ 15: బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతి అభివృద్ధి కార్యక్రమంలో ప్రతి గ్రామ పంచాయతీకి కేటాయించిన ట్రాక్టర్లు మూలన చేరాయి. అధికారుల పర్యవేక్షణ లేక, జీపీకి నిధులు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతున్నది. మండలంలోని పెద్ద ముబారక్‌పూర్‌లో స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట పల్లె ప్రగతి ట్రాక్టర్, ట్రాలీ మూలకు చేరాయి. కొన్ని రోజులు క్రితం ట్రాక్టర్ ఇంజిన్ చెడిపోయింది. దీనికి రిపేర్ చేయించే నాథుడే కరువయ్యారు. దీంతో గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, చెట్లకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయాయి. గతంలో వీటి బాధ్యత సర్పంచ్‌లు చూసుకునేది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియగానే ప్రత్యేక అధికారుల పాలన రావడంతో నిధులు లేక వాళ్లు చేతులెత్తేశారు. ట్రాక్టర్ పనిచేయకపోవడంతో గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి, వీధులు కంపుకొడుతున్నాయి. ఈ విషయమై మండ ల పంచాయతీ అధికారి బ్రహ్మయ్యను వివరణ కోరగా, ట్రాక్టర్ చెడిపోయిన విషయం వాస్తవమేనన్నారు. దీన్ని రిపేర్ చేయించేందుకు అవసరమయ్యో నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పెట్టామని, నిధులు రాగానే రిపేర్ చేయిస్తామని ఆయన పేర్కొన్నారు.

బైపాస్ రోడ్డుకు బీటీ మోక్షమెప్పుడో..

- మట్టిరోడ్డుతో అవస్థలు
- ప్రమాదాల బారినపడుతున్న వాహనచోదకులు
- బీటీరహదారి నిర్మించాలి: కంగ్టివాసులు

కంగ్టి, జూన్ 15: కంగ్టి పట్టణానికి పిట్లం రోడ్డు వైపు నుంచి నారాయణఖేడ్‌కు వెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం బైపాస్ రోడ్డు నిర్మించింది. రైతుల నుంచి భూములు సేకరించి సుమారు కిలోమీటర్ మేర డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డు మట్టిది కావడంతో ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతిరోజు బైపాస్ మట్టిరోడ్డు మీదుగా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వర్షాలకు ఈరోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. రాత్రివేళలో ఈరోడ్డు గుండా ప్రయాణిస్తే ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బైపాస్ రోడ్డును బీటీగా మార్చాలని కోరుతున్నారు.

మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో కలిసి ఆవిష్కరిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు

ఆధునిక వసతులతో మోడల్ పీఎస్ నిర్మాణం

- మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ గౌడ్

జిన్నారం, జూన్ 15: బొల్లారం మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 248లోని ఎకరా స్థలంలో హెటిరో లేబరేటరీస్ సౌజన్యంతో రూ.3.50 కోట్లతో నిర్మించనున్న మోడల్ పోలీస్ స్టేషన్ పనులకు మల్టీజోన్ ఐజీ సత్యనారాయణగౌడ్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ కుమార్‌తో కలిసి మెదక్ ఎంపీ రఘునందన్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. హెటిరో లేబరేటరీస్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమిపూజ చేశారు. అనంతరం ఐజీ సత్యనారాయణ మాట్లాడుతూ.. మినీ ఇండియాగా పేరొందిన బొల్లారంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించాలనే లక్ష్యంతో మోడల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికత, పూర్తిస్థాయి వసతులతో వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో నిర్మాణానికి సహకరిస్తున్న హెటిరో యాజమాన్యానికి, ప్రజా ప్రతినిధులకు ఐజీ ప్రత్యేకంగా పోలీస్‌శాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు. ము ఖ్యఅతిథులను పరిశ్రమ ప్రతినిధులు ఘనం గా సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రభాకర్, సీఐలు రవీందర్‌రెడ్డి, నయూమొద్దీన్, ట్రాఫిక్ సీఐ లాలూనాయక్, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, సీఎస్ఆర్ హెడ్ రవిబాబు, స్థానిక నాయకులు చంద్రారెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, ఆనంద్ కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు, సంస్థ ప్రతినిధులు సుధాకర్, అరుణ్, రామరావు, స్థానికులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా కంగ్టిలోని బీటీ వేయని బైపాస్ రోడ్డు